క్లుప్తంగా

అప్రమత్తంగా ఉండాలి



మహిళా పోలీసులనుద్దేశించి మాట్లాడుతున్న సీఐ రామకృష్ణ

నెల్లిమర్ల: సచివాలయాల పరిధిలో శాంతిభద్రతల పరిరక్షణ పట్ల మహిళా పోలీసులు అప్రమత్తంగా ఉండాలని సీఐ రామకృష్ణ కోరారు. స్థానిక పోలీస్‌స్టేషన్‌లో నగర పంచాయతీ, మండలానికి చెందిన సచివాలయ మహిళా పోలీసులు మంగళవారం మర్యాదపూర్వకంగా కలిశారు. కొత్తగా బాధ్యతలు స్వీకరించిన సీఐ, ఎస్‌ఐలకు పుష్పగుచ్ఛం అందజేసి, శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ సచివాలయాల పరిధిలో ఏమైనా సమస్యలుంటే తన దృష్టికి తీసుకురావాలని సూచించారు. కార్యక్రమంలో ఎస్‌ఐ బి.గణేష్, సిబ్బంది పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో విశ్వశాంతి మహాయజ్ఞం



విశ్వశాంతి మహాయజ్ఞం నిర్వహిస్తున్న వేదపండితులు

విజయనగరం టౌన్: స్థానిక మెయిన్‌రోడ్డు సంతపేటలో కొలువైన జగన్నాథస్వామి ఆలయ ఆవరణలో విశ్వశాంతి శ్రీమద్భాగవతసప్తాహ జ్ఞానయజ్ఞం మంగళవారం వేదపండితులు ఘనంగా నిర్వహించారు. తిరుమల తిరుపతి దేవస్థానముల వేదపండితులు గుదిమెళ్ల అనంత వెంకట జగన్నాథఆచార్య స్వామి ప్రత్యక్ష పర్యవేక్షణలో పీసపాటి నరసింహాచార్యులు, పవన్, మణికంఠస్వామి నిర్వహణతో అత్యంత వైభవంగా నిర్వహించారు. సాయంత్రం నిర్వహించిన శ్రీమద్భాగవత ప్రవచనం ఆద్యంతం భక్తులను ఆకట్టుకుంది. ఈ నెల 28 వరకూ ప్రతీ రోజూ ప్రత్యేక కార్యక్రమాలు, విశేష హోమాలు నిర్వహిస్తామని అర్చకులు తెలిపారు. కార్యక్రమంలో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

పౌష్టికాహారంతో సంపూర్ణ ఆరోగ్యం



కార్యక్రమంలో మాట్లాడుతున్న సీడీపీఓ ఎస్తేరురాణి

డెంకాడ: అన్ని రకాల పోషక విలువలు ఉన్న ఆహారం తీసుకోవడం ద్వారా ఆరోగ్యంగా ఉంటారని భోగాపురం ఐసీడీఎస్ సీడీపీఓ ఎస్తేరు రాణి అన్నారు. మండలంలోని అక్కివరం సెక్టార్ పరిధిలో రఘుమండ గ్రామంలో పోషణ మాసోత్సవాలు మంగళవారం జరిగాయి. దీనిలో పాల్గొన్న అంగన్‌వాడీ కార్యకర్తలు పౌష్టికాహారంతో పలు రకాల అవగాహన కార్యక్రమాలు చేశారు. దీనిలో పాల్గొన్న సీడీపీఓ ఎస్తేరురాణి మాట్లాడుతూ గర్భిణులు, బాలింతలు అందుబాటులో ఉన్న మంచి ఆహారం తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ సత్యవతి, అంగన్‌వాడీ కార్యకర్తలు, మహిళలు, గర్భిణులు, బాలింతలు పాల్గొన్నారు.

సమష్టి కృషితోనే స్వర్ణాంధ్ర సాధ్యం



2047 అభివృద్ధి క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న ఈఓపీఆర్‌డీ, తదితరులు

విజయనగరం రూరల్: స్థానిక ప్రజాప్రతినిధులతో పాటు అన్ని శాఖల సమన్వయంతో స్వర్ణాంధ్ర 2047 సాధ్యపడుతుందని పంచాయతీ విస్తరణాధికారి తిరుపతిరావు తెలిపారు. కోరుకొండ గ్రామంలో మంగళవారం ఏర్పాటు చేసిన గ్రామసభలో ఆయన మాట్లాడారు. 2047 నాటికి భారతదేశం వందేళ్ల స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను నిర్వహించబోతున్న నేపథ్యంలో ఆ సమయానికి ఏపీలో అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానంతో కూడిన అభివృద్ధిని చేపట్టాలని రాష్ట్ర ప్రభుత్వం యోచిస్తోందన్నారు. ఇందులో భాగంగా ఏపీలో సమగ్ర అభివృద్ధి జరగాలనే సంకల్పం ప్రతీ ఒక్కరూ తీసుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ శంకరరావుతో పాటు సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

వరద బాధితులకు విరాళం



చెక్కును అందుకుంటున్న కలెక్టర్ డాక్టర్ బీఆర్ అంబేడ్కర్

విజయనగరం అర్బన్: నెల్లిమర్ల మండలం తంగుడుబిల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల తరఫున సీఎం రిలీఫ్ ఫండ్‌కు రూ.10 వేలు విరాళాన్ని అందజేశారు. దీనికి సంబంధించిన చెక్కును కలెక్టర్ డాక్టర్ బీఆర్ అంబేడ్కర్‌కు మంగళవారం అందజేశారు. వారిని కలెక్టర్ అభినందించారు. కార్యక్రమంలో జేసీ ఎస్.సేతుమాధవన్, డీఈఓ ఎన్.ప్రేమకుమార్, పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఆరోగ్య ప్రదాతలు పారిశుద్ధ్య కార్మికులు

- విజయనగరం కార్పొరేషన్ మేయర్ విజయలక్ష్మి
- పారిశుద్ధ్య కార్మికులకు సత్కారం



పారిశుద్ధ్య కార్మికులను సత్కరిస్తున్న నగర మేయర్, డిప్యూటీ మేయర్, కమిషనర్ తదితరులు

విజయనగరం: పారిశుద్ధ్య కార్మికులు ప్రజారోగ్య ప్రదాతలని విజయనగరం మున్సిపల్ కార్పొరేషన్ మేయర్ వెంపడాపు విజయలక్ష్మి పేర్కొన్నారు. స్థానిక ఆనంద గజపతి ఆడిటోరియంలో పారిశుద్ధ్య కార్మికుల సత్కార మహోత్సవం మంగళవారం ఘనంగా జరిగింది. స్వచ్ఛత హి సేవ కార్యక్రమంలో భాగంగా నిర్వహించిన సన్మాన మహోత్సవంలో ముందుగా అతిథులు జ్యోతి ప్రజ్వలన చేశారు. అనంతరం మహాత్మాగాంధీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం విజయవాడ వరదల్లో విశేష సేవలు అందించిన 150 మంది పారిశుద్ధ్య కార్మికులకు, సహాయక చర్యల్లో పాల్గొన్న అధికారులకు, సిబ్బందికి ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా నగర మేయర్ విజయలక్ష్మి మాట్లాడుతూ మహాత్మాగాంధీ స్వాతంత్ర్యంతో పాటు స్వచ్ఛతా దేశంగా తీర్చిదిద్దాలన్న ఆశయంతో ఉండేవారన్నారు. అదే స్ఫూర్తితో ప్రధాన మంత్రి నరేంద్రమోదీ స్వచ్ఛ సంకల్పంతో అనేక కార్యక్రమాలు రూపొందించి అమలు చేస్తున్నారన్నారు. ఇందులో భాగంగా ప్రజలను ఆరోగ్యవంతంగా ఉంచుతూ, నగరాన్ని పరిశుభ్రపరుస్తూ విశేషమైన సేవలు అందిస్తున్న పారిశుద్ధ్య కార్మికులను సన్మానించడం ఆనందంగా ఉందన్నారు. విజయనగరం కార్పొరేషన్ కమిషనర్ పల్లి నల్లనయ్య మాట్లాడుతూ విజయవాడ వరదల్లో అద్భుతమైన సేవలు అందించి అందరి చేత అభినందనలు అందుకున్న వారిని సన్మానించుకోవడం ఎంతైనా ముదావహమని అన్నారు. శివుడు బూడిద రాసుకున్నట్లుగా, పారిశుద్ధ్య కార్మికులు ఊరి మురికినంత ఒంటికి రాసుకుంటూ అపర రుద్రులు వలె ఉంటున్నారనడంలో అతిశయోక్తి కాదన్నారు. ఇదే ఒరవడితో మరింతగా పనితీరును మెరుగుపరచుకొని విజయనగరం కార్పొరేషన్‌కు మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. పారిశుద్ధ్య కార్మికుల ఆరోగ్య భద్రతకై విరివిగా వైద్య శిబిరాలు ఇక నుండి నిర్వహిస్తామని చెప్పారు. సత్కార గ్రహీతల సేవలను ఆదర్శంగా తీసుకుని మిగిలిన వారంతా పనితీరు మెరుగుపరుచుకోవాలని సూచించారు. డిప్యూటీ మేయర్ కోలగట్ల శ్రావణి మాట్లాడుతూ పారిశుద్ధ్య కార్మికుల సేవలు వెలకట్టలేనివని అన్నారు. కరోనా సమయంలో అత్యంత విలువైన సేవలను అందించారని కొనియాడారు. కార్యక్రమంలో ప్రజారోగ్య అధికారి డాక్టర్ కొండపల్లి సాంబమూర్తి, ఈఈ కె.శ్రీనివాసరావు, ఏసీపీ అమ్మాజీరావు, మున్సిపల్ ఎంప్లాయిస్ యూనియన్ అధ్యక్షుడు పట్నాల వెంకటేశ్వరరావు, పారిశుద్ధ్య పర్యవేక్షకులు తదితరులు పాల్గొన్నారు.

క్రీడలతో మానసికోల్లాసం



క్రీడలను ప్రారంభిస్తున్న చైర్‌పర్సన్ సరోజిని

నెల్లిమర్ల: క్రీడలతోనే మానసికోల్లాసమని నగర పంచాయతీ చైర్‌పర్సన్ బంగారు సరోజిని పేర్కొన్నారు. జిల్లా స్థాయి స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ క్రీడా పోటీల ఎంపికలు స్థానిక థామస్‌పేట ఫుట్‌బాల్ గ్రౌండ్‌లో స్కూల్‌గేమ్స్, ఫెడరేషన్ ఆధ్వర్యంలో మంగళవారం జరిగాయి. క్రీడలను నగర పంచాయతీ చైర్‌పర్సన్ ప్రారంభించారు. క్రీడాకారులను పరిచయం చేసుకున్నారు. అండర్ 14, 17 విభాగంలో బాల, బాలికలు కబడ్డీ, ఖోఖో, బ్యాడ్మింటన్, చెస్, యోగా, అథ్లెటిక్ పోటీలు ఎంపికలు జరిగాయి. కార్యక్రమంలో నగర పంచాయతీ కమిషనర్ టీవీఎస్.విశ్వేశ్వరరావు, ఎంఈఓ యూఎస్ఎన్.మూర్తి, పీడీలు జి.తవిటినాయుడు, బి.రామారావు తదితరులు పాల్గొన్నారు.

గోసంరక్షణ పట్టణ మహిళా కమిటీ అధ్యక్షురాలిగా లక్ష్మి



లక్ష్మిని అభినందిస్తున్న రామకృష్ణ తదితరులు

విజయనగరం ఫోర్ట్: ఏపీ గో సంరక్షణ సమాఖ్య పట్టణ మహిళా కమిటీ అధ్యక్షురాలిగా గాజులరేగకు చెందిన చెన్నా తులసి ఎన్నికయ్యారు. స్థానిక దండు మారమ్మ ఆలయం రోడ్డులో ఉన్న గో సంరక్షణ సమాఖ్య కార్యాలయంలో మంగళవారం పట్టణ మహిళా కమిటీని ఎన్నుకున్నారు. ఉపాధ్యక్షురాలిగా సోము నందిని, కార్యదర్శిగా కోరాడ మాధురియాదవ్, ఆర్గనైజింగ్ సెక్రటరీగా ఏలూరి రమణమ్మ, జాయింట్ సెక్రటరీగా పెందుర్తి సంతోషి ఎన్నికయ్యారు. వీరిని గోసంరక్షణ సమాఖ్య అధ్యక్షుడు లోగిశ రామకృష్ణ అభినందించారు.

సీతంలో ముగిసిన 'పోటీ కోడింగ్' వర్క్‌షాప్



సత్కారం పొందుతున్న శిక్షకుడు మహంతి పృథ్వీ

విజయనగరం అర్బన్: గాజులరేగ సీతం ఇంజినీరింగ్ కళాశాల కంప్యూటర్ సైన్స్, డిప్లమా రెండవ, మూడవ సంవత్సరాల విద్యార్థులకు రెండు రోజులుగా నిర్వహిస్తున్న 'పోటీ కోడింగ్ వర్క్‌షాప్' మంగళవారం ముగిసింది. బోధ సాఫ్ట్‌వేర్ టెక్నాలజీస్ సంస్థతో అనుసంధానంగా శిక్షకుడు మహంతి పృథ్వీ సదస్సులో అవగాహన కలిగించారు. విద్యార్థులు పజిల్స్ అభివృద్ధి చేశారు. ఈ పోటీ కోడింగ్ వర్క్‌షాప్ గురించి విద్యార్థులు అభిప్రాయాలు, అనుభవాలు పంచుకున్నారు. అనంతరం శిక్షకుడిని ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో కళాశాల డైరెక్టర్ డాక్టర్ ఎం.శశిభూషణరావు, కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ద్వివేదుల రామమూర్తి, కృత్రిమ మేధస్సు మరియు డేటా సైన్స్ విభాగాధిపతి డాక్టర్ రాధ, వివిధ విభాగాల అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ప్లాస్టిక్ రహిత క్యాంప్‌గా క్లీనింగ్

ప్లాస్టిక్ రహిత క్యాంపస్‌గా సీతం కళాశాలను తీర్చిదిద్దాలని కళాశాల డైరెక్టర్ డాక్టర్ శశిభూషణ్ అన్నారు. కళాశాల ఎన్ఎస్ఎస్ యూనిట్ మంగళవారం నిర్వహించిన క్యాంపస్ క్లీనింగ్ డ్రైవ్‌ను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా కళాశాల ప్రాంగణంలో ప్లాస్టిక్, వ్యర్థపదార్థాలను ఏరివేత ప్రాధాన్యతపై విద్యార్థులను చైతన్య పరిచారు. కార్యక్రమంలో కళాశాల ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారి ఎస్.సతీష్ కుమార్, వలంటీర్లు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న సాంస్కృతిక ప్రదర్శనలు



తప్పెట గుళ్ల ప్రదర్శన చేస్తున్న కళాకారులు



శ్రీవైష్ణవి కళాక్షేత్రం చిన్నారుల నృత్యప్రదర్శన

విజయనగరం టౌన్: స్థానిక మూడులాంతర్లు వద్ద నున్న పైడితల్లి అమ్మవారి చదురుగుడి ఆలయ ప్రాంగణంలో మంగళవారం రాత్రి నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆద్యంతం ఆకట్టుకున్నాయి. రామభద్రపురం మండలం పాతరేగ గ్రామానికి చెందిన శ్రీ కృష్ణ తప్పెటగుళ్ల బృందం నిర్వహించిన ప్రదర్శన ఆద్యంతం చూపరులను ఆకట్టుకుంది. రాయవలస గ్రామానికి చెందిన శ్రీరామబృందం కోలాట ప్రదర్శన, వైష్ణవి కళాక్షేత్రం చిన్నారుల నృత్య ప్రదర్శన భక్తులను కట్టిపడేసింది. అనంతరం ప్రముఖ ఆధ్యాత్మిక ప్రవచన శిరోమణి డాక్టర్ పెన్నేటి స్వప్న హైందవి నిర్వహించిన పైడితల్లి అమ్మవారి ఆధ్యాత్మిక ప్రవచనం ఆద్యంతం భక్తిపారవశ్యంలో ముంచెత్తింది. అనంతరం ఆలయ ఈఓ డీవీవీ ప్రసాదరావు కళాకారులను ఆధ్యాత్మిక వేత్తలను దుశ్శాలువతో ఘనంగా సత్కరించారు.

నగర పంచాయతీ కమిషనర్‌గా అప్పలరాజు

నెల్లిమర్ల: నెల్లిమర్ల నగర పంచాయతీ కమిషనర్‌గా అప్పలరాజును నియమిస్తూ ప్రభుత్వం మంగళవారం ఉత్తర్వులు జారీ చేసింది. భీమవరం మున్సిపాలిటీ మేనేజర్‌గా విధులు నిర్వర్తిస్తున్న అప్పలరాజు పదోన్నతిపై ఇక్కడకు విచ్చేస్తున్నారు. ఇక్కడ ఇన్‌చార్జి కమిషనర్‌గా కొనసాగుతున్న టీవీఎస్ విశ్వేశ్వరరావు యలమంచిలి మేనేజర్‌గా వెళ్లనున్నారు.

అక్రమ హక్కు పత్రాలను రద్దు చేయాలి

- జామి తహసీల్దార్‌పై కలెక్టర్‌కు ఫిర్యాదు



వినతితో జామి మండలం విజినిగిరి గ్రామ మహిళ వరలక్ష్మి

విజయనగరం అర్బన్: కోర్టు వివాదంలో ఉన్న నలుగురికి చెందిన కుటుంబ వారసత్వ భూమికి ఒక్కరిని హక్కుదారుని చేస్తూ జామి మండల తహసీల్దార్ హక్కుపత్రాలను ఆన్‌లైన్‌లో చేసారని దీన్ని రద్దు చేయాలని జామి మండలం విజినిగిరి గ్రామవాసి యడ్ల వరలక్ష్మి కలెక్టర్‌కి అర్జీ పెట్టారు. దాదాపు 31 ఎకరాల సాగు భూమి నలుగురు అన్నదమ్ములకు సరిసమానంగా వారివారి ఆధీనంలో ఉందని... కానీ అన్నదమ్ముల మధ్య ఏర్పడిన వివాదం కారణంగా హక్కుదారుల అంశంపై కోర్టులో కేసు నడుస్తుందని తెలిపారు. అయితే ఇటీవల జరిగిన ఎన్నికల ముందు అప్పటి జామి తహసీల్దార్ హేమంత్‌కుమార్ అక్రమంగా ఆ 31 ఎకరాల సాగు భూమిలో 16 ఎకరాలు అన్నదమ్ముల్లో ఒక్కరికే అక్రమంగా హక్కుపత్రాలను ఆన్‌లైన్‌లో జారీ చేసారని పేర్కొన్నారు. కలెక్టర్ స్పందించి సాయంత్రంలోపు పూర్తి వివరాలు ఇవ్వాలని సంబంధిత తహసీల్దార్‌కు వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ఆదేశాలిచ్చారు. సంతకవిటి మండలం సిరిపురం గ్రామానికి చెందిన పలువురు రైతులు తమకు మడ్డువలస కాల్వ ద్వారా సాగునీరు సక్రమంగా అందడం లేదని పేర్కొంటూ కలెక్టర్‌కు వినతిపత్రాన్ని అందజేశారు.

ఆరు నెలలకొకసారి అల్బెండజోల్ వేయాలి



కంటోన్మెంట్‌లోని అంగన్‌వాడీ కేంద్రం చిన్నారులతో మాట్లాడుతున్న జస్వీందర్

విజయనగరం ఫోర్ట్: విద్యార్థుల్లో నులి పురుగుల నివారణకు అల్బెండజోల్ మాత్ర తప్పనిసరిగా ఆరు నెలలకు ఒకసారి వేసుకోవాలని ఎవిడెన్స్ యాక్షన్ సంస్థ జాతీయ అధికారి జస్వీందర్ తెలిపారు. నేషనల్ డీవార్మింగ్ డే ప్రోగ్రాం జరిగిన విధానం గురించి తెలుసుకునేందుకు మంగళవారం విజయనగరం పట్టణంలోని పలు ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాలను సందర్శించి సిబ్బందితో పిల్లలతో మమేకమై వివరాలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా అల్బెండజోల్ మాత్ర వేసుకోవడంతో పాటు తరచూ చేతులు శుభ్రపరుచుకోవాలని తెలిపారు.

పుష్పాలంకరణలో పైడితల్లి



పైడితల్లి అమ్మవారు

విజయనగరం టౌన్: ఉత్తరాంధ్రుల ఆరాధ్య దైవం, కోరిన కోర్కెలు తీర్చే కల్పవల్లి శ్రీ పైడితల్లి అమ్మవారు మంగళవారం పుష్పాలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. ఆలయ ప్రధాన అర్చకులు ఏడిద రమణ ఆధ్వర్యంలో అమ్మవారికి వేకువజాము నుంచి పంచామృతాలతో అభిషేకాలు, అర్చనలు నిర్వహించారు. ఆలయ సిరిమాను పూజారి బంటుపల్లి వెంకటరావు, తాళ్లపూడి ధనుంజయ్, నేతేటి ప్రశాంత్, తాతా రాజేష్, సాయి, శంబరి కృష్ణ శాస్త్రోక్తంగా అమ్మవారికి కుంకుమార్చనలు చేశారు. పైడితల్లి అమ్మవారికి ఆపిల్ పండ్లతో నివేదన చేశారు. అనంతరం మహిళలు అమ్మవారిని దర్శించి, పసుపు కుంకుమలను సమర్పించి మొక్కుబడులు చెల్లించారు. అమ్మవారికి ఘటాలతో నివేదన చేశారు. ఆలయం వెనుక ఉన్న వేప, రావిచెట్ల వద్ద దీపారాధనలు నిర్వహించారు. కార్యక్రమాలను ఆలయ ఈఓ డీవీవీ ప్రసాదరావు పర్యవేక్షించారు.

ఇలా చేయొచ్చా...



పెట్రోల్ బంకు దగ్గర సెల్‌ఫోన్ మాట్లాడడం ప్రమాదం. పెట్రోల్ వేసేటప్పుడు ఇది మరింత ప్రమాదం. ఈ విషయం తెలిసినా కొందరు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. గంట్యాడ మండలం కొటారుబిల్లి వద్ద ఓ పెట్రోల్ బంకులో ఓ యువకుడు ఇలా బైక్‌లో పెట్రోల్ వేసే సమయంలో మంగళవారం ఫోన్ మాట్లాడుతూ ఇలా కనిపించాడు. ఒకరి చేసే చిన్న పొరపాటుకు ఏదైనా జరగరానిది జరిగితే ఎవరూ బాధ్యత వహిస్తారు...ప్లీజ్...ఓక్కసారి ఆలోచించండి... ప్రమాదాన్ని కొనితెచ్చుకోకండి.

- సాక్షి ఫొటోగ్రాఫర్, విజయనగరం

వరద బాధితులకు అండగా ఆర్యవైశ్యులు



ఆర్యవైశ్య సంఘం నూతన కమిటీ ప్రతినిధుల సమావేశం

విజయనగరం: విజయవాడ సింగనగర్ వరద బాధితులను ఆదుకునేందుకు జిల్లా ఆర్యవైశ్య సంఘం నూతన కమిటీ తీర్మానించింది. స్థానిక ఆర్యవైశ్య సంఘం భవనంలో సంఘం అధ్యక్షుడు చెరుకూరి నాగరాజు (కుంకాల పండు) ఆధ్వర్యంలో నూతన కమిటీ సభ్యులు మొదటి సమావేశం మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో మండల స్థాయిలో సంఘాలను బలోపేతం చేసేందుకు కృషి చేయాలని కోరారు. జిల్లా ఆర్యవైశ్య సంఘం ద్వారా చేయబోతున్న కార్యక్రమాలకు ఒక ప్రణాళిక రచించి సభ్యులకు తెలియజేస్తామని అన్నారు. కార్యదర్శి డిమ్స్ రాజు మాట్లాడుతూ శ్రీ వాసవీ కన్యకా పరమేశ్వరి అమ్మవారి ఆత్మార్పణ దినోత్సవాన్ని ప్రభుత్వం నిర్వహించేందుకు జీఓ విడుదల చేయడం పట్ల కృతజ్ఞతలు తెలియపారు. విజయవాడలో సింగనగర్ వరద బాధితులకు రూ.75 వేలు అందజేయబోతున్నట్లు చెప్పారు. సమావేశంలో ఆలవెల్లి శేఖర్, దాలయ్యశెట్టి, బలభద్రుని నానాజీ, వెత్సా సత్యనారాయణ మూర్తి, మాచర్ల చంద్రశేఖర్ గుప్తా తదితరులతో పాటు వివిధ సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి



పేరాపురంలో పారిశుద్ధ్యం పరిశీలిస్తున్న జిల్లా కీటక జనిత నియంత్రణ అధికారి మణి

పూసపాటిరేగ : సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా వుండాలని జిల్లా కీటక జనిత నియంత్రణ అధికారి వై.మణి అన్నారు. పేరాపురం గొల్లపేట గ్రామంలో మంగళవారం పర్యటించారు. గ్రామంలో ఇంటింటికి వెళ్లి పారిశుద్ధ్యం పరిశీలించారు. నీటి నిల్వలు, నీటి డ్రమ్ముల్లో నిల్వలు లేకుండా చూడాలని సూచించారు. నీటి డ్రమ్ములలోను, ఫ్రిజ్ వెనుక భాగంలో లార్వాలను పరిశీలించారు. చికెన్ గున్యా, డెంగీ తదితర వ్యాధులు సోకే అవకాశం ఉన్నందున ప్రతి ఒక్కరు వారానికి ఒకరోజు డ్రైడే పాటించాలి అన్నారు. పంచాయతీ అధికారులు ద్వారా గ్రామంలో ఇండోర్‌స్ప్రే, ఏంటీలార్వా స్ప్రేను చేయాలని సూచించారు. కార్యక్రమంలో సబ్ యూనిట్ అధికారి గోవిందరాజు, హెల్త్ సూపర్‌వైజర్ ఉమాపతి, ఆరోగ్య సహాయకులు ఆర్.వి. రమణ, జి.బంగారుబాబు, ఎంఎల్‌హెచ్‌పీఓ అరుణ, ఏఎన్ఎం ఇ.సీత తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థుల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ అవసరం

- డీఎంహెచ్‌ఓ ఎస్.భాస్కరరావు



కార్యక్రమంలో మాట్లాడుతున్న డీఎంహెచ్‌ఓ డాక్టర్ భాస్కరరావు

విజయనగరం ఫోర్ట్: విద్యార్థుల ఆరోగ్యంపై కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ (సీహెచ్‌ఓ)లు ప్రత్యేక శ్రద్ధ చూపాలని డీఎంహెచ్‌ఓ డాక్టర్ ఎస్.భాస్కరరావు అన్నారు. స్థానిక యూత్ హాస్టల్‌లో నేచర్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో యూనిసెఫ్ సౌజన్యంతో యూత్ హాస్టల్‌లో సీహెచ్‌సీలకు నిర్వహించిన తొలిబ్యాచ్ శిక్షణ కార్యక్రమాన్ని ఆయన మంగళవారం ప్రారంభించారు. హెచ్ఐవీ వ్యాప్తి, వ్యాధి సోకకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై విద్యార్థులకు అవగాహన కల్పించాలన్నారు. కార్యక్రమంలో ఆర్‌బీఎస్‌కే కో ఆర్డినేటర్ డాక్టర్ సుబ్రహ్మణ్యం, ఎం.అనూష, యూనిసెఫ్ సీనియర్ కన్సల్టెంట్ శ్రీలత, డాక్టర్ ఉమామహేశ్వరరావు, నేచర్ సంస్థ డైరెక్టర్ ఎస్.వికాష్, ఆర్.కె.ఎస్.కె.కన్సల్టెంట్ మృదుల, తదితరులు పాల్గొన్నారు.

కవి మురళీకృష్ణకు శిఖామణి సాహిత్య యువ పురస్కారం



పాయల మురళీకృష్ణ

విజయనగరం అర్బన్: సంధ్య పత్రికా సంపాదకుడు, ప్రముఖ కవి శిఖామణి పేరున ఈ ఏడాది ప్రదానం చేసే సాహిత్య యువ పురస్కారానికి పట్టణానికి చెందిన యువ కవి పాయల మురళీకృష్ణ ఎంపికయ్యారు. ఈ మేరకు అవార్డు ఎంపిక కమిటీ అధ్యక్షుడు దాట్ల దేవదానంరాజు నుంచి ఎంపిక ఆదేశాలు వచ్చాయని మురళీకృష్ణ మంగళవారం విడుదల చేసిన ప్రకటనలో పేర్కొన్నారు. యానాంలో అక్టోబర్ 27న జరిగే కార్యక్రమంలో ఈ అవార్డును ప్రదానం చేస్తారని తెలియజేశారు. నగదు బహుమతి, జ్ఞాపికతో సత్కరించనున్నారని తెలిపారు. ప్రస్తుతం మురళీకృష్ణ రాచకిండా జెడ్పీహెచ్ స్కూల్‌లో హిందీ ఉపాధ్యాయునిగా పని చేస్తున్నారు. అవార్డుకు ఎంపిక కావడంపై ఆ స్కూల్ ప్రధానోపాధ్యాయులు, పాఠశాల బోధన, బోధనేతర సిబ్బంది ఆయన్ని అభినందించారు.

వరిలో సస్యరక్షణతో అధిక దిగుబడులు



రైతులకు అవగాహన కల్పిస్తున్న ఏఓ నీలిమ

పూసపాటిరేగ : వరిలో సస్యరక్షణతోనే అధిక దిగుబడులు సాధించవచ్చునని ఏఓ కె.నీలిమ అన్నారు. మండలంలోని రెల్లివలస గ్రామంలో వరి పొలం బడి కార్యక్రమం మంగళవారం జరిగింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రైతులకు మిత్ర పురుగులు, శత్రు పురుగులు గురించి అవగాహన కల్పించారు. ఉధృతిని బట్టి పురుగు మందులు వినియోగించాలన్నారు. గొంగళి పురుగులు, రసం పీల్చే పురుగులు గుర్తించి తెగులు లక్షణాలను రైతులకు వివరించారు. కార్యక్రమంలో రైతు ఉత్పత్తి కేంద్రం సీఈఓ ప్రభాకర్, వ్యవసాయ శాఖ అసిస్టెంటు అనిత, ప్రజాప్రతినిధులు మహంతి శంకర్రావు, ఇజ్జరోతు ఈశ్వర్రావు, గొర్లె రమణతో పాటు అధిక సంఖ్యలో రైతులు పాల్గొన్నారు.




డెంకాడ: చొల్లంగిపేటలో రైతులకు అవగాహన కల్పిస్తున్న వ్యవసాయాధికారులు

మోతాదుకు మించి ఎరువులు వాడొద్దు..

డెంకాడ: వరి పంట సాగు చేసే రైతులు మోతాదుకు మించి రసాయన ఎరువులు వాడరాదని మండల ప్రత్యేకాధికారి ఏవీఎస్ జమదగ్ని, మండల వ్యవసాయాధికారి పి.నిర్మల అన్నారు. మండలంలోని చొల్లంగిపేట గ్రామంలో పొలం పిలుస్తోంది కార్యక్రమం మంగళవారం నిర్వహించారు. ఏఓ మాట్లాడుతూ ఇండి గ్యాప్ సర్టిఫికెట్‌ను పొందేందుకు ప్రామాణికమైన ఎరువులు, పురుగు మందులను మాత్రమే వాడాలన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ బంటుపల్లి వాసుదేవరావు, మాజీ ఎంపీపీ కంది చంద్రశేఖర్, ఎంపీటీసీ గుడివాడ కిరణ్, డి.కొల్లాం సర్పంచ్ అట్టాడ కృష్ణ, అభ్యుదయ రైతు పాణిరాజు, రైతులు పాల్గొన్నారు.

తక్కువ పెట్టుబడితో ఎక్కువ లాభాలు



విజయనగరం రూరల్: పొలం పిలుస్తోంది కరపత్రాలను విడుదల చేస్తున్న అధికారులు

విజయనగరం రూరల్: తక్కువ పెట్టుబడితో అధిక లాభాలను ఎలా పొందవచ్చో పొలం పిలుస్తోంది కార్యక్రమం ద్వారా తెలుసుకోవచ్చని రైతు శిక్షణా కేంద్రం సహాయ సంచాలకులు భారతి అన్నారు. మండలంలోని దుప్పాడ, రాకోడు గ్రామాలలో పొలం పిలుస్తోంది కార్యక్రమంలో ఆమె పాల్గొన్నారు. రైతులను ఉద్దేశించి ఆమె మాట్లాడుతూ వరి పంటలలో వచ్చే తెగులు పురుగులు, సూక్ష్మధాతువులు లోపాలపై అవగాహన కలిగించారు. రైతులు అడిగిన పలు సందేహాలను నివృత్తి చేశారు. కార్యక్రమంలో వ్యవసాయ అధికారిణి హర్షలత, ఉద్యానవన శాఖాధికారిణి జ్యోత్స్న, పశు సంవర్థక శాఖ అధికారి శృతి, స్థానిక సర్పంచ్‌లు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

సేంద్రీయ వ్యవసాయానికి ప్రాధాన్యత ఇవ్వాలి

నెల్లిమర్ల రూరల్: సేంద్రీయ వ్యవసాయానికి రైతులు ప్రాధాన్యతనివ్వాలని ఏఓ పూర్ణిమ సూచించారు. మండలంలోని సీతారామునిపేట, రామతీర్థం గ్రామాల్లో పొలంబడి కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. క్షేత్ర స్థాయిలో వరి పంటలను పరిశీలించి రైతులకు పలు సూచనలు అందించారు. అధిక ఎరువుల వాడకంతో ఆరోగ్యానికి హాని జరుగుతుందని, సేంద్రీయ పద్ధతిలో సాగు చేసే విధానాన్ని అలవర్చుకోవాలన్నారు. ఈ నెల 26లోపు స్థానిక రైతు సేవా కేంద్రాల్లో ఈకేవైసీ చేయించుకోవాలన్నారు.

రాష్ట్ర మార్క్‌ఫెడ్ చైర్మన్‌గా కర్రోతు



బంగార్రాజుకు శుభాకాంక్షలు తెలియజేస్తున్న ఎంపీ అప్పలనాయుడు తదితరులు

పూసపాటిరేగ : ఏపీ రాష్ట్ర మార్క్‌ఫెడ్ కార్పొరేషన్ చైర్మన్‌గా కర్రోతు బంగార్రాజును నియమిస్తూ ప్రభుత్వం నుండి ఉత్తర్వులు వెలువడ్డాయి. భోగాపురం మండలం పోలిపల్లికి చెందిన బంగార్రాజు ఇప్పటికే టీడీపీ నెల్లిమర్ల నియోజకవర్గం ఇన్‌చార్జిగా పని చేస్తున్నారు. బంగార్రాజుకు ఈ అరుదైన అవకాశం దక్కడంతో నెల్లిమర్ల టీడీపీ శ్రేణులు అభిమానులు ఆయన స్వగ్రహంలో కలిశారు. ప్రభుత్వం నుండి వెలువడిన తొలి జాబితాలో అత్యంత కీలకమైన పదవి దక్కడంతో నియోజకవర్గం టీడీపీ శ్రేణులలో నూతన ఉత్సాహం నెలకొంది. పలువురు అభిమానులు, కార్యకర్తలు ఇంటికి వెళ్లి శుభాకాంక్షలు తెలియజేశారు. ఆయనను కలిసిన వారిలో విజయనగరం ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడుతో పాటు పలువురు వున్నారు.